క్లుప్తంగా

భవిష్యత్ అంతా ఏఐదే



మాట్లాడుతున్న జేఎన్టీయూ మెకానికల్ హెచ్ఓడీ కళ్యాణి రాధ

గుత్తి: భవిష్యత్ అంతా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)దేనని జేఎన్టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ హెచ్ఓడీ కళ్యాణి రాధ అన్నారు. గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఏఐ ఆవిష్కరణలు అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆధునిక మెకానికల్ సిస్టమ్స్, డిజైన్ ప్రక్రియలలో ఏఐ పరివర్తన పాత్రపై వివరించారు. ప్రిడిక్టివ్ మెయింటనెన్స్, స్మార్ట్ తయ్యారీ , డిజైన్ ఆప్టిమైజేషన్ వంటి రంగాల్లో ఏఐ టెక్నాలజీ ఏకీకరణపై మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, మెకానికల్ హెచ్ఓడీ డాక్టర్ ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బీరువా వితరణ చేశారు. గుత్తి పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, దివంగత ఎల్‌వీ.కృష్ణారెడ్డి సతీమణి రాధ, కుమారుడు డాక్టర్.మధుసూదన్‌రెడ్డి సోమవారం జరిగిన కార్యక్రమంలో బీరువాను అందజేశారు. విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, పాఠ్య పుస్తకాలు, ఇతర వస్తువులను ఉంచుకోవడానికి ఉపయోగించుకునేలా దాతలు బీరువాను అందజేశారు. బీరువా ఇచ్చిన దాతలకు హెచ్ఎం మహాలక్ష్మితో పాటుగా ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబుళపతి, రామకృష్ణయ్య, సులోచన, శివప్రసాద్, రవీంద్రనాథ్‌రెడ్డి, సుజాత, సాధన, కళ, రత్నకుమారి, నిరుపమ, మాదన్న, శ్రీదేవి, చంద్ర, నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

నేడు దేవదాయ భూముల కౌలుకు వేలం

పామిడి: మండలంలోని నెమళ్లపల్లిలె ఈశ్వర, పోతులరాజు దేవదాయ భూముల కౌలుకు మంగళవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఈఓ ఏ క్రిష్ణయ్య సోమవారం తెలిపారు. స్థానిక ఆలయంలో ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందన్నారు. 2025–26, 27, 28 సంవత్సరాలకు నిర్వహించే వేలంలో పాల్గొన దలచినవారు రూ.500 డిపాజిట్ చెల్లించాన్నారు. ఆసక్తి ఉన్నవారు 9441012561 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీపీఎం భూ పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

గుత్తి: గుత్తిలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పేదలతో కలిసి సోమవారం భూ పోరాటం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, మండల కార్యదర్శి నిర్మల ఆధ్వర్యంలో కార్యకర్తలు, పేదలు అనంతపురం రోడ్డులోని సత్యసాయి పంప్ హౌస్ వద్ద సర్వే నంబర్ 321లో పార్టీ జెండాలు పాతారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు ఇవ్వకపోతే భూ పోరాటాల ద్వారా సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రామకృష్ణ, రేణుక, రమేష్, మల్లేష్, మల్లికార్జున, రేవతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

పుట్లూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి సోమవారం బాలాపురం పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు 150 పుస్తకాలను అందజేశారు. ప్రస్తుతం గ్రూప్స్ పరీక్షలతో పాటు డీఎస్సీ తదితర పోటీ పరీక్షలు ఉన్నందున గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు సాయం అందించాలనే ఉద్దేశ్యంతో పుస్తకాలు అందజేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా దాతను గ్రంథాలయాధికారి జయరాములు అభినందించారు.

మొక్కజొన్న పంట దగ్ధం



మొక్కజొన్న పంట కాలిపోయిన దృశ్యం

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మొక్కజొన్న పంటతో పాటు బిందుసేద్య పరికరాలు దగ్ధమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు మారుతీనాయుడు ఏడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఆదివారం పంటకు మంటలు వ్యాపించడంతో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్నతో పాటు 40 పైపులు, ఆరు డ్రిప్పు కట్టలు, ఇతర పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

చిన్నపాటి వర్షానికే మార్కెట్ చిత్తడి

- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గుత్తిలోని కూరగాయల మార్కెట్‌లో అపరిశుభ్రత



చిత్తడిగా ఉన్న మార్కెట్

గుత్తి: పట్టణంలోని అంబేద్కర్ కూరగాయల మార్కెట్ చిన్న పాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. వర్షం వచ్చిందంటే వ్యాపారులు, కొనుగోలుదారులు(ప్రజలు) తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఐదు సెంట్లలో మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పూర్తి ఇరుకుగా ఉంది. ఇందులోనే సుమారు 50 మంది కూరగాయల వ్యాపారం సాగిస్తున్నారు. ఏ మున్సిపాలిటీలో కూడా ఇంత చిన్న కూరగాయల మార్కెట్ లేదు. ఇరుకుగా, చిత్తడిగా మార్కెట్ ఉండటంతో జనాలు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

వర్షం పడితే మరింత ఇబ్బంది

వర్షం వస్తే వ్యాపారం అసలు జరగదని వ్యాపారుల వాపోతున్నారు. ట్యాక్స్‌లు చెల్లిస్తున్నా ఎలాంటి సదుపాయాలు కల్పించలేదన్నారు. ఇరుకుగా ఉండడంతో మహిళలు మార్కెట్‌లోకి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. పేరుకు మాత్రమే మున్సిపాలిటీ. కూరగాయాల మార్కెట్‌లో ఎలాంటి సాకర్యాలు లేవు. దీంతో వ్యాపారులతో పాటు జనాలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు తెలిపారు.

ఎక్కడ చూసినా అపరిశుభ్రతే



మార్కెట్‌లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. మార్కెట్ పూర్తి అధ్వానంగా మారడంతో కొనుగోలు దారులు రావడం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి మార్కెట్‌ను శుభ్రం చేయించాలి.

–లక్ష్మీనారాయణ, కూరగాయల వ్యాపారి

కొనుగోలుదారులు రావడం లేదు



వర్షాలు వస్తే జనాలు అసలు మార్కెట్‌కు రారు. దీంతో వ్యాపారాలు పూర్తిగా పడిపోతాయి. మార్కెట్‌ను శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. పన్నులు మాత్రం కట్టించుకుంటున్నారు.

–సునీల్‌కుమార్, కూరగాయల వ్యాపారి

ఇరుకుగా ఉంది



మార్కెట్ చాలా ఇరుకుగా ఉంది. దీంతో ప్రజలు కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు రావాలంటే జంకుతున్నారు. మార్కెట్ ఎపుడూ చిత్తడిగా ఉంటుంది. మున్సిపల్ అధికారులు స్పందించి మార్కెట్ శుభ్రంగా ఉండేలా చూడాలి.

–హనుమక్క, వ్యాపారి

త్వరలోనే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తాం



త్వరలోనే కమర్షియల్ మార్కెట్ నిర్మిస్తాం. అందులోనే కూరగాయాల మార్కెట్ కూడా ఏర్పాటు చేయిస్తాం. రూ. 11 కోట్లతో కమర్షియల్ మార్కెట్ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపాం.

–జబ్బార్ మియా, మున్సిపల్ కమిషనర్

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



తాడిపత్రిలో అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో ప్రమోట్ చేసిన దృశ్యం



గార్లదిన్నె మండలం కనంపల్లిలో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న ఉపాధ్యాయులు

తాడిపత్రి రూరల్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సీడీపీఓ సాజిదాబేగం సూచించారు. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం తల్లిదండ్రులకు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ సెంటర్ నుంచి ఐదు సంవత్సరాలు పైబడిన చిన్నారులందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని టీచర్లను ఆదేశించారు. ఇంటింటికీ టీచర్లు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేయాలని టీచర్లను ఆదేశించారు.

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ప్రభుత్వ బడిలో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడిలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు వివరించారు. ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు అందజేసి విద్యను అందిస్తామన్నారు. అనంతరం అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ బడిలో ప్రవేశాలకు అడ్మిషన్లు చేశారు.

‘సూపర్ సిక్స్’ హామీలు నెరవేర్చాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు

గుంతకల్లు రూరల్: సూపర్‌సిక్స్‌తో పాటు మేనిఫెస్టోలో ఉన్న ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ తదితరులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రధాన అస్త్రంగా వాడి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 11 నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయలేదన్నారు. సూపర్‌సిక్స్‌తో పాటు మరో 176 హామీలను అమలు పరచాల్సిన ప్రభుత్వం .. వీటన్నింటినీ పక్కన బెట్టి రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసగిస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

మామిడిచెట్లు నరికిన వారిని అరెస్ట్ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామంలో రెండు రోజుల క్రితం దళితుల పొలాల్లో మామిడి చెట్లు నరికిన వారి వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి కత్తుల కొండయ్య, భూపతి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ నిరుపేద దళితులు ప్రభుత్వ భూమిలో పంటలు సాగు చేసుకుంటే కొందరు జీర్ణించుకోలేక చెట్లు నరకడం దారుణమన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఉషారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోభీఘాట్‌కు పట్టా మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రజకులు

గార్లదిన్నె: కల్లూరు అగ్రహారంలో రజకులకు దోభీఘాట్‌కు రెవెన్యూ అధికారులు డీ– పట్టా మంజూరు చేయాలని జిల్లా రజక సంఘం నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కల్లూరు అగ్రహారం రజకులు దోభీ ఘాట్ నిర్మాణం కోసం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 38–12 సర్వే నంబర్‌లో 0.49 సెంట్లలో గత 80 సంవత్సరాల నుంచి దోభీ ఘాట్ ఏర్పాటు చేసుకుని 100 కుటుంబాలు రజక వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రెవెన్యూ అధికారులు 1971లో 0.45 సెంట్లకు డి–పట్టా మంజూరు చేశారన్నారు. అప్పటి నుంచి వారి కుటుంబ సభ్యులు సాగులో లేరన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ చేసిఆంజనేయ స్వామి రజక వృత్తిదారుల సమాఖ్య పేరు మీద రజకులకు డి– పట్టా మంజూరు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు నాగప్ప, నాయకులు రుద్రయ్య, పుల్లన్న, రామాంజనేయులు, రాము, వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఫైనాన్స్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి



రూరల్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ సీపీఐ నాయకులతో కలసి బాధితులు సోమవారం రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని జీ.కొట్టాల గ్రామానికి చెందిన రాధమ్మ అనే మహిళ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలతో కుమ్మక్కై గ్రామంలోని నిరుపేదలు, నిరక్షరాస్యులను టార్గెట్ చేసింది. రుణాలను ఆశగా చూపి, వారి దగ్గర నుంచి బ్యాంకు పాసు పుస్తకాలు, ఏటీఎం కార్డులు సేకరించింది. మరిన్ని నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి వారికి తెలియకుండా వారి పేరున భారీ ఎత్తున రుణాలను తీసుకుని ఉడాయించింది. ఈ క్రమంలో ఫైనాన్స్ కంపెనీలు రుణాల వసూలు కోసం పేదల ఇంటికి వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో దిక్కుతోచని బాధితులు సోమవారం సీపీఐ నాయకులతో కలసి రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌ను కలసి న్యాయం చేయాలని ఫిర్యాదు అందజేశారు.

అర్హులందరికీ ఇంటి స్థలమివ్వాలి

గుత్తి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రామదాసు, రాజు డిమాండ్ చే శారు. సీపీఐ ఆధ్వర్యంలో పేదలు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫిబ్రవరిలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆందోళన చేసి 1,000 దరఖాస్తులు ఇచ్చామన్నారు. అయితే ఇంతవరకూ ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. స్థలాలు ఇచ్చే వరకూ ఆందోళన చేపడతామన్నారు. అనంతరం పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమైక్య నియోజకవర్గ అధ్యక్షురాలు మహముదా, సీపీఐ సహాయ కార్యదర్శి నజీర్, రైతు సంఘం అధ్యక్షులు వెంకటరాముడు, సీనియర్ నాయకులు మాబ్బీ, షఫీ, వెంకటేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పామిడి: ఉపాధి పథకం పెండింగ్ వేతనాలను కూలీలకు వెంటనే చెల్లించాలని సీపీఎం అనుబంధ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పీ అనిమిరెడ్డి, మల్లేసు, చంద్రమోహన్ డిమాండ్ చేశారు. గత ఏడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యమవుతోందన్నారు. పనుల వద్ద కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు, కూలీలందరికీ పనిముట్లు ఇవ్వాలన్నారు. 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఉపాధి పని చేస్తూ ప్రమాదవశాత్తు చనిపోయిన వ్యవసాయ కూలీలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సోషల్ ఆడిట్‌లో అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. ఆ సంఘం నాయకులు శివకుమార్, శంకర్, రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుంతకల్లుటౌన్: ఆర్ఆర్‌బీ గ్రూప్–డీ, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో 75 రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.నాయుడు ఉచితంగా క్లాసులు చెప్పిన అధ్యాపకులను సత్కరించారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్ర, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మోటార్ చోరీ

బుక్కరాయసముద్రం: మండలంలోని నీలాంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ మోటార్ చోరీ అయిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పాఠశాలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీదారులపై కేసు

గుంతకల్లు రూరల్: మండలంలోని కదిరిపల్లిలో సోమవారం నాటుసారా తయారు చేస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, అనంతపురం డీటీఎఫ్ బృందం, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఆధ్వర్యంలో సోమవారం కదిరిపల్లిలో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా నాటుసారా తయారు చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

చలివేంద్రం ప్రారంభం

గార్లదిన్నె: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ యోగానందరెడ్డి చలివేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత నేపథ్యంలో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చే ప్రజలకు చలివేంద్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటనారాయణ, ఈఓఆర్డీ దామోదరమ్మ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ప్రవేశ పరీక్ష

యాడికి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో సోమవారం నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 66 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ మారుతి తెలిపారు. మండల వ్యాప్తంగా 6వ తరగతి ప్రవేశం కోసం 92 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 26 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు.

పరీక్షలు, మార్కులే జీవితం కాదు



గుత్తిలో మాట్లాడుతున్న ఎంఈఓ రవినాయక్

గుత్తి/బుక్కరాయసముద్రం/ఉరవకొండ: పరీక్షలు, మార్కులే జీవితం కాదని గుత్తి ఎంఈఓ రవి నాయక్, పెద్దవడుగూరు ఎంఈఓ గురు ప్రసాద్ సూచించారు. గుత్తి కస్తూర్బా బాలికల పాఠశాలలో సోమవారం ఎస్ఓ రుద్రాక్షి ఆధ్వర్యంలో 'మార్కులే జీవితమా?' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఎంఈఓలు మాట్లాడుతూ పదవ తరగతిలో ఫెయిల్ అయినా పాస్ అయినా ఒకే విధంగా భావించాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు అఘాయిత్యాలకు పాల్పడవద్దన్నారు. గుత్తి, పెద్దవడుగూరు, గార్లదిన్నె, పామిడి,యాడికి మండలాల ఎంఈఓలు, కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. అలాగే బీకేఎస్‌లోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల మానసిక స్థితి, పరీక్షల మార్కులే జీవితమా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు నార్పల, శింగనమల, రాప్తాడు, కూడేరు, కేజీబీవీ పాఠశాలలకు సంబంధించిన టెన్త్ క్లాస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఎంఈఓలు లింగా నాయక్, నవీద ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ కేజీబీవీలో ఉరవకొండ, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు మండలాల కేజీబీవీ 10 తరగతి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో జిల్లా సమగ్ర శిక్ష కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో 'పరీక్షలు, మార్కులే జీవితం కాదు'పై అవగాహన సమావేశం నిర్వహించారు.

ఇసుక, మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



పోలీసులు సీజ్‌చేసిన వాహనాలు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఇసుక మట్టిని తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న తాడిపత్రి డివిజన్ శాండ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి రామాంజులరెడ్డి అనే వ్యక్తికి చెందిన ప్రొక్లెయిన్‌తో పాటు నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పజెప్పారు. దాడి జరిగిన అనంతరం పలువురు రైతులు పోలీసులను ఆశ్రయించి భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తమకు అనుకూలమైన చోట బోర్లు వేయించి, అక్కడి నుంచి పొలాలకు పైపులైన్లు ఏర్పాట్లలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఇసుక, మట్టిని పైపులైన్ నిర్మాణం కోసం తరలిస్తుండగా పోలీసులు దాడులు చేసి వాహనాలను సీజ్ చేశారని రైతులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను సీజ్ చేసి తహసీల్దార్‌కు సమాచారం అందించామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ రైతులకు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు

తాడిపత్రి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. పటాాట్టర్ పాసు పుస్తకానికి ఆధార్ నంబర్ లింక్ చేసేందుకు ఒక అర్జీ, కల్లం దొడ్డికి సరిహద్దులు చూపించాలని మరొకటి, పాసు బుక్ మంజూరుకు, భర్త మరణించడంతో అతడి పేరిట ఉన్న ఇంటి నివేశన స్థలం అప్పగింత పట్టాను తన పేరిట మార్చాలని దరఖాస్తులు అందజేశారన్నారు.

దూదేకుల సంఘం ప్రధాన సలహాదారుడిగా బాబయ్య



తాడిపత్రి రూరల్: రాష్ట్ర దూదేకుల సంఘం ప్రధాన సలహాదారుడిగా తాడిపత్రికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబయ్యను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డులో సూర్య స్కూల్ నిర్వహిస్తున్న బాబయ్య గత మునిసిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కౌన్సిలర్‌గా పోటీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం పని చేశారు. రాష్ట్ర ప్రధాన సలహాదారుడిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. దూదేకుల సంఘం సంక్షేమానికి కృషిచేస్తానన్నారు.

9న అయ్యప్ప విగ్రహ ప్రతిష్ట



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద వెలసిన హర హర అయ్యప్ప స్వామి దేవాలయంలో మే 9న అయ్యప్ప విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో అనంతపురం– తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో రూ. 2 కోట్లతో నూతనంగా అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం చేపట్టారు. ఆలయంలో మే 9న శబరిమల ప్రధాన తంత్రి కంటారు రాజీవ్ ఆధ్వర్యంలో తంత్రి శ్రీ బ్రహ్మదత్త తదితరులు అయ్యప్ప విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపడతామన్నారు. 9వ తేదీ నుంచి ఆలయంలో నిత్య పూజలుంటాయన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కరపత్రాలు విడుదల చేశారు.

అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం



అసంపూర్తిగా నిర్మించిన కాలువ

గుంతకల్లు: స్థానిక సాయినగర్‌లో అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నగర్‌లోని లాయర్ చెన్నకేశవులు వీధిలో మురికి కాలవ నిర్మాణం చేపట్టారు. అయితే మురికి కాలవ వీధి మొత్తం వేయకుండా సగం వరకూ వేసి మిగిలిన 150 మీటర్ల పొడవు మేర కాలువ నిర్మించుకుండా వదిలేశారు. దీంతో మురుగుతో వ్యర్థాలు అక్కడ నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతూ దోమలకు అవాస కేంద్రంగా మారిందని వీధి ప్రజలు వాపోతున్నారు. ఇక చిన్నపాటి వర్షం కురిసినా పైఏరియాల్లోని వరద నీరంతా ఇక్కడకు చేరుతుంది. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

25న మండల సమావేశం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 25న ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి సమీక్ష ఉంటుందన్నారు.

ఎస్సీ అట్రాసిటీ కేసు విచారణ

గార్లదిన్నె: ఎస్సీ అట్రాసిటీ కేసును విచారించేందుకు సోమవారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సందర్శించారు. కనంపల్లికి చెందిన జానకి అనే మహిళ అదే గ్రామానికి చెందిన దళిత యువకుడిని కులం పేరుతో దూషించినట్లు ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దళిత సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మహిళపై ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడంతో ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి డీఎస్పీ విచారణ చేపట్టారు.